# ప్రేమ అనురాగం

రచన: శ్రీమతి వసంత రామానుజం

ప్రేమ అనేది అనేక రకాలుగా వుంటుంది. తల్లిప్రేమ, తండ్రిప్రేమ, అన్నాచెల్లెలిపై ప్రేమ, యింకా అనేక రకాలుగా చెప్పవచ్చును. అలాగే పిల్లలకు కూడా తనను తనను ప్రేమించేవారిపై ఎనలేని గౌరవం, అభిమానంతో వారు వుంటారు.

రాఘవ ఎంతో మంచివాడు, ఉదారుడు. పిల్లలంటే ఆతనికి అమితమైన ప్రేమ. తన ప్రాణంలో ప్రాణంగా చూసుకొంటాడు. అతనికి ఇద్దరు పిల్లలు. పెద్ద అమ్మాయి పేరు రాధ. చిన్నమ్మాయి పేరు సుజాత. తండ్రిపోలికలు కూతురికి, తల్లి పోలికలు కొడుక్కి వస్తుందంటారు. అలాగే రాధ పోలికలు అంతా తండ్రిలాంటి మనస్తత్వం కలిగినది. రాఘవ భార్య అరుణ. భర్త అడుగుజాడల్లో నడుస్తూ ఆదర్శసంతురాలుగా వుంటూ, 'తన ప్రాణం భర్త ఒడిలో పోవాలని' పరితపించేది. సుజాత ఇంటరు చదువుతుంది.

రాధను 2 ఏండ్లక్రిందట పెండ్లిచేసి అత్తవారింటికి పంపించాడు రాఘవ. అల్లుడు వైజాగ్‌లో ఇంజనీరుగా పనిచేస్తూవుండడంవలన రాధ కూడా అక్కడికే వెళ్ళిపోయింది. ఒక కుమారుణ్ణికూడా ప్రసవించింది. పేరు రఘురామ్. రాధ పెండ్లికాకముందు నాన్నకు చేదోడు వాదోడుగా వుంటూ నాన్న పనులు చేస్తూవుండేది.

నాన్నకు ఏ కష్టం లేకుండా చూచేది. రాఘవకు అప్పుడప్పుడు అన్నం తింటూవుండగా పొర పోయేది. వెంటనే రాధ నీళ్ళు అందించి నాన్నను వుపశమనం చేస్తూవుండేది. అందువలన రాధ వైజాగ్‌లో వుంటూవుండేను ప్రతి జాబులోను "నాన్నా! మీరు బాగున్నారా! రాత్రుల్లో నిదర పోయే సమయంలో త్రాగటానికి నీళ్ళు వుంచుకోండి. పొర పోతే మీకు నీళ్ళు యిచ్చేవాళ్ళుకూడ లేరు" అని విచారిస్తూ వ్రాసేది.

రాఘవ కూడా తన ముద్దుల కూతురు రాధను వదలి వుండలేక మనసు గట్టిచేసుకొని "అమ్మా రాధ! నిన్ను మంచి అయ్య చేతిలోపెట్టి నీవు సంసారం చేస్తూ వుంటే చూచి ఆనందించాలని వుందమ్మా" అని పెండ్లికి ఒప్పించి ప్రసాద్‌తో కల్యాణం చేయించాడు.

కాలచక్రం తిరుగుతూ రెండు సం॥లు అయినది. కాని ఉత్తరాలతో నాన్న మంచిచెడలను విచారిస్తూవచ్చింది. నిర్మలమైన మనసులు ఎంత దూరం వున్నా, వేరుపడక, దూరమవుతున్నకొలది మరి గట్టిపడుతుంది.

దీపావళికి అల్లుణ్ని కూతుర్ని 4 రోజులకు ముందుగా రమ్మని రాఘవ ఉత్తరం వ్రాశాడు. రాధ కూడ తన ప్రాణంలో ప్రాణం, జన్మనిచ్చిన తండ్రిని ఎన్నడు చూస్తానా?" అని 'తల్లికోసం చూచే లేగదూడలాగ' తపన పడసాగింది. ప్రసాద్ కూడ ఆఫీసు పనులు చూచుకొని పండక్కి సరిగ్గా వస్తానని చెప్పి రాధను 25 వ తేది పంపుతున్నట్లు మామగారికి టెలిగ్రామ్ యిచ్చాడు.

రాఘవ ఆ టెలిగ్రామ్ చూచుకొని ఎప్పుడు 27 వ తేది వస్తుంది, తన ముద్దుల కూతుర్ని చూడాలి అని తపించి పోయాడు. అతనికి 1 నిమిషం యుగంలాగా వుండేది. తన ఆవేదనను బలవంతాన లాగిపట్టుకొని జీవితాన్ని గడుపసాగాడు. 25 వ తేది రానేవచ్చింది 26 వ తేది వైజాగ్ సాయంత్రం 4 గం॥కు బయలుదేరి మదరాసు 27 ఉదయం 10 గం॥కు వస్తుంది.

27వ తేది ఉదయం తెలుగు ప్రాంతీయ వార్తలు విందామని రాఘవ పడకమీద పడుకొని ట్రాన్‌సిస్టర్ ఆన్‌చేశాడు అందులో

"ముఖ్య ప్రకటన. నిన్న హౌరా మదరాసు వెళ్ళే ఎక్స్‌ప్రెస్ గూడూరు ప్రక్క స్టేషన్‌లో పట్టాలు తప్పినందువలన యాక్సిడెంటు జరిగినది. కొలదిమంది ప్రాణాలు పోగొట్టుకొన్నారు. కాని చాలామందికి గాయాలు తగిలినవి. ఇలా చేసినవారు రిజర్వేషన్‌లకొఱకు కొందరు దుండగులు చేసినదని భావిస్తున్నారు" అన్నది.

ఆ మాటలు విన్నంతనే రాఘవ "అరుణ" "సుజా" అంటూ పెద్దగా కేకవేశాడు. అరుణ గబగబా దగ్గరకు వచ్చింది. సుజాత చదువు మాని నాన్న గదిలోకి వచ్చింది. రాఘవ ఏడ్చుకొంటూ "అయిపోయింది. అంతా అయిపోయింది. గూడూరుకు ప్రక్క స్టేషనులో ఆ రాకాసి ఎక్స్‌ప్రెస్ నా చిట్టితల్లి రాధమ్మను పొట్టన పొట్టుకొంది. అమ్మా సుజాతమ్మా! నిన్ను నన్ను వదలిపోయింది' అని చిన్నపాపలాగ ఏడుస్తూ రేడియోలో వచ్చిన వార్తను తెలిపాడు.

అరుణ తనభర్త అలాగ ఏడుస్తూవుంటే తన దుఃఖాన్ని ఆపుకోలేకపోయింది ఇద్దరి పరిస్థితి చూచి సుజాత అమ్మ

భుజంమీద వ్రాలి ఏడ్వసాగింది. కొంతసేపు తర్వాత మనసు ధైర్యం చేసికొని అరుణ "విచారించకండి! మీ రాధకు ఏమీ జరిగివుండదు. మీ ప్రేమయే ఆమెకు శ్రీరామ రక్ష. ఆ రాధను సర్వదా కాపాడుతూ వుంటుంది" అని ధైర్యం చెప్పి

సుజాతవైపు చూచి "అమ్మా! రైల్వే ఎన్‌క్వయిరీకి ఫోన్‌చేసి, చనిపోయినవారిలో గాని, దెబ్బలు తగిలినవారిలో గాని రాధ అనే పేరు వుందేమో కనుక్కో" అన్నది.

ఆ మాటలు అమ్మ చెప్పిందో లేదో, ఫోన్‌చేయడానికి వెళ్ళింది సుజాత.

రాఘవ, అరుణ ఒడిలో తలపెట్టి చిన్నబిడ్డలాగ ఏడుస్తూ "అమ్మా రాధ! నన్ను వదలి వెళ్ళిపోయావామ్మా! నాకు కనిపించవా? నన్ను ఎంతో ముద్దుగా, ఏ కష్టం లేకుండా వుండేలాగ చూచావే. ఇప్పుడు ఎక్కడికి వెళ్ళిపోయావు తల్లీ" అని ఏడుస్తూవుంటే అరుణకు దుఃఖము పొంగి కట్టలు త్రెంచుకొని వచ్చింది. అయిన ధైర్యంతో "ఏమండి విచారించకండి. మీ రాధకు ఏమీ జరిగివుండదు" అని అంటూవుంటే సుజాత ఏడ్చుకుంటూ లోనికి వచ్చింది.


"ఏమ్మా! ఏదైనా వివరాలు తెలిసిందా?" అన్నది అరుణ.

సుజాత "అమ్మా! రైల్వేవారికి ఫోన్‌చేశాను. వారు రాధ అనే పేరుగలవారు యాక్సిడెంటు జరిగినట్లు లేదని, అటువంటి పేరుగలవాళ్ళు లేరని తెలిపారు" అన్నది.

ఆ మాటలు వినగానే రాఘవ ఏడుస్తూ మనసులోనే "హే భగవంతుడా! నా ముద్దుల కూతురు వచ్చేవేళ యీ స్ట్రైక్ జరగాలి. నా రాధ నేను తీసుకోవాలి నా జీవితంలో ఎవ్వరిని ఏమీ కోరిందిలేదు తండ్రి. కాని ... కాని ... నా ప్రాణం ప్రాణమయిన నా రాధను నాదగ్గరకు పంపించు. నా బాధను అర్థంచేసుకోమని" విలపించాడు.

గుమ్మంముందు టాక్సీ ఒకటి ఆగింది. అందుండి ఒక స్త్రీ దిగి, తన కుమారునితోను, సూట్‌కేస్ తీసుకొని హాలులో వుంచి, యింట్లో ఎవరూ లేరా అనుకొంటూ బెడ్‌రూముకు వెళ్ళింది. అక్కడ సుజాత, అమ్మ నాన్నలు వుండటం చూచి ఆశ్చర్యంతో "నాన్నా!" అంటూ తన తండ్రిని కౌగలించుకొన్నది. రాఘవ వెర్రిచూపులు చూస్తూ 'ఇది కల కాదుకదా' అని ఆలోచించసాగాడు.

రాధ "నాన్నా! మీ రాధను. మీ చిన్నారి రాధ. ఏమిటి అలాగా చూస్తున్నారు" అన్నది. రాఘవ తన ముద్దుల కూతుర్ని మనసారా కౌగలించుకుంటూ "అమ్మా! రైలు ఆక్సిడెంటులో ఏమైపోయావో అని నా ప్రాణం తపించి పోయిందమ్మా" అన్నాడు.



అరుణ రేడియోలో వచ్చిన ప్రకటన చెప్పింది. సుజాత అక్క వచ్చినందుకు ఆనందకన్నీరు కార్చుకుంటూ చిన్నారి రఘురాముని ఎత్తుకొన్నది. రాధ తన ప్రయాణాన్నిగురించి తెలుపుతూ ...

'నాన్నా! నేను ఆ రైలులో ప్రయాణమై వస్తున్నాను. కాని రైలులో ప్రయాణం చేస్తున్నానే కాని, మిమ్మల్ని చూడాలని, మీ ఒడిలో వాలిపోవాలని తపించిపోయేదాన్ని. గూడూరు స్టేషను రానే వచ్చింది. అక్కడనుండి రైలు స్ట్రైక్ కారణంగా నిలచిపోయిందని, యిక వెళ్ళదని అంటూ వచ్చారు. నాకు ఏం చేయాలో తెలియడంలేదు. బాబుని భుజాన్న వుంచుకొని, ఒక చేతో సూట్‌కేస్ తీసుకొని స్టేషన్ బయటకు వచ్చాను. బస్సులు కూడా లేవని తెలిపారు. ఇద్దరు భార్యాభర్తలు అర్జంటుగా మదరాసు పోవాలని ఒక టాక్సీతో బేరమాడుతుండగా నేను వెళ్ళి "అయ్యా! నేను మదరాసు వెళ్ళాలి. ఎంత డబ్బు అయినా యిచ్చుకుంటాను. ఎలాగైన తీసుకవెళ్ళ"మని ప్రాధేయ పడ్డాను.

ఆ దంపతులు ముసలివాళ్ళుగా వుండబట్టి నన్ను తీసుక వెళ్ళడానికి అంగీకరించారు. ఎంత త్వరగా ఉదయంలోగా మదరాసు వెళితే బాగుండునని మనసులోనే నాన్నను తలంచుకొంటూ, భగవంతుని ప్రార్థిస్తూ గడిపాను. ఇక్కడ వచ్చి చూడగా పేపర్లులోనూ తాటికాయ అక్షరాలతో హౌరా ఎక్స్‌ప్రెస్‌కు యాక్సిడెంటు జరిగినదని తెలిసినది. ఇదంతా నాన్న ప్రేమయే. నాన్నగారిని చూడాలని అనుకోబట్టి ధైర్యంచేసి టాక్సీపట్టి యిక్కడకు రాగలిగాను" అని నాన్న ఒడిలో వాలింది.

అరుణకు తన భర్త సంతోషంగా వుండడం చూచి పొంగిపోయింది. "అమ్మా సుజాతా! అక్కకు వేడినీళ్ళు పెట్టమ్మా స్నానం చేస్తుంది" అన్నది. సుజాత సంతోషంగా బాబుని ఎత్తుకొని వెళ్ళింది. అరుణ యింటి పనులు చూడటానికి వెళ్ళింది.

రాధ రాఘవ గదిలోనే వుండి చాలసేపు వరకు తన మనసులోని విషయాలను చెప్పుకుంటూ వుండిపోయారు,